క్లుప్తంగా

బెల్ట్ షాపులు, సారా విక్రయాలపై నిఘా



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీ కేవీ నాగప్రభు కుమార్, ఏఈఎస్ అజయ్‌కుమార్ సింగ్

భీమడోలు: నాటుసారా అమ్మకాలు, బెల్ట్ షాపులపై నిఘా పెట్టాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా సహాయ కమిషనర్ కేవీ నాగప్రభుకుమార్ అన్నారు. భీమడోలు సర్కిల్ ఎక్సైజ్ కార్యాలయాన్ని గురువారం ఏఈఎస్ అజయ్‌కుమార్ సింగ్, సహాయ కమిషనర్ నాగప్రభుకుమార్‌లు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ బి.సత్యనారాయణకు వారు పలు సూచనలు చేశారు. సర్కిల్ పరిధిలో బెల్ట్ షాపులు, నాటు సారా అమ్మకాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు, నాటు సారా అమ్మకాలను అరికట్టాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్సైలు రామస్వామి, శివ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణానికి అడ్డంకులు తొలగించండి



లేఖను చూపిస్తున్న మద్దా భూషణం

దెందులూరు : స్థానిక రైల్వే గేట్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి రైల్వే శాఖ పరంగా సహాయ సహకారాలు అందించాలని ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ సాధన సమితి చైర్మన్ మద్దా భూషణం అన్నారు. విజయవాడ రైల్వే శాఖ డీఆర్‌ఎంకు సమాచార హక్కు చట్టంలో వినతి పత్రం అందించారు. డీఆర్‌ఎం నుంచి భూషణంకు గురువారం లేఖను పంపారు. ఏలూరు కలెక్టర్ కార్యాలయం రైల్వే శాఖ ఏడీఈ నుంచి సమాచారం అందుకుని తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని డీఆర్‌ఎం వివరించారని భూషణం తెలిపారు. ఇప్పటికే దెందులూరు రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ మంజూరుకు పెదపాడు, పెదవేగి, దెందులూరు, భీమడోలు మండలాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల నుంచి సంతకాల సేకరించి ప్రజా ప్రతినిధులకు ఇచ్చినట్టు చెప్పారు.

విద్యార్థులకు స్టీలు ప్లేట్ల పంపిణీ

భీమడోలు: స్థానిక పాఠశాల–4లోని 64 మంది విద్యార్థులకు రిటైర్డ్ ఎంపీడీఓ కోటయ్య స్టీలు పళ్లాలను గురువారం ఎంఈఓలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్‌ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వారన్నారు. టీచర్ జయశ్రీ, హెచ్‌ఎం బుల్లి దొర, టీచర్లు పాల్గొన్నారు.

నాన్‌స్టాప్, స్లీపర్, ఎక్స్‌ప్రెస్‌లను నిలపాలి

భీమడోలు: స్థానిక జంక్షన్, రైల్వే గేటుల వద్ద ఏపీఎస్‌ఆర్‌సీ నాన్‌స్టాప్, స్లీపర్, ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయాలని రాష్ట్ర ఏపీఎస్‌ఆర్‌టీసీ విజయవాడ జోన్ రీజనల్ బోర్డు చైర్మన్ రెడ్డి అప్పలనాయుడుకు బుధవారం భీమడోలు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. విజయవాడలో అప్పలనాయుడును కలిసి వినతిపత్రం అందించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు ప్రయాణికులు, భక్తులకు ప్రధాన మార్గంగా ఉన్న భీమడోలు జంక్షన్, రైల్వే గేటుల వద్ద ఎక్స్‌ప్రెస్‌లు, స్లీపర్, నాన్‌స్టాప్ బస్సులను నిలుపుదల చేయాలని కోరారు. గుండుగొలను, కొవ్వూరు ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం వల్ల ఆ బస్సులన్నీ హైవేపై వెళ్లడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, రాత్రి వేళల్లో మరింత ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు పి.మదన్, శ్రావణ్‌కుమార్, ఈతకోట సత్యకృష్ణ, లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ క్షత్రియ సేవా సమితి డైరెక్టర్‌గా కృష్ణంరాజు

ఉంగుటూరు : నారాయణపురానికి చెందిన పొత్తూరి కృష్ణంరాజు ఏపీ క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్టు ఆయన తెలిపారు. కృష్ణంరాజుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

గృహ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్ : ఏలూరు పరిసర పోణంగి అర్బన్ హౌసింగ్ లే అవుట్‌కాలనీ (జగనన్న కాలనీ) జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి గురువారం సందర్శించారు. కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు, మౌలిక వసతుల కల్పనను పరిశీలించారు. కాలనీలో చేపట్టిన ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలని కలెక్టర్ సూచించారు. లక్ష్యం పూర్తికి గృహ నిర్మాణశాఖ అధికారులు సంబంధిత ఏజెన్సీలు, కార్మికులతో చర్చించాలన్నారు. ఎప్పటికప్పుడు పనులపై పర్యవేక్షించాలని సూచించారు. గృహ నిర్మాణంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో మరింత వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు ఎస్‌జీహెచ్ రుణాలు చెల్లింపు, ఎన్ని విడతల్లో రుణం చెల్లిస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పశువుల సంచారం.. ప్రయాణికుల్లో భయం

- రోడ్లపై జనసంచార ప్రదేశాల్లో తిష్ట
- యజమానుల నిర్లక్ష్యం
- రాకపోకలకు ప్రయాణికుల ఇబ్బందులు



బువ్వనపల్లిలో రోడ్డుపై సంచరిస్తున్న పశువులు



రోడ్డపై రాత్రి వేళల్లో ఆంబోతుల గుంపు

నిడమర్రు : మండలంలోని ప్రధాన రహదారుల్లో పశువుల సంచారం ఎక్కువైంది. ఒక పక్క పశు సంపద తరిగిపోతుందని బాధపడుతుంటే.. ఉన్న పశువులను యజమానులు రోడ్లపైకి వదిలేస్తున్నారు. అవి నిత్యం రద్దీగా ఉండే గణపవరం – చేబ్రోలు రాష్ట్రీయ రహదారిపై అడ్డగా తిష్టవేస్తున్నాయి. ఒకేసారి గుంపులుగా పరుగెడుతున్నాయి. వాటిని తప్పించుకుని వాహనాలు నడిపేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

రాత్రి వేళల్లో ప్రమాదకరంగా..

ఇటీవల పలువురు ఆంబోతులను వదిలారు. వాటి బారి నుంచి పగటి వేళల్లో తప్పించుకున్నా... రాత్రి వేళల్లో అవి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఆటోలు, ద్విచక్రవాహనాలు రోడ్డుపై తిష్టవేసిన పశువుల నుంచి తప్పించుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. గణపవరం నుంచి నిడమర్రు వరకు ఏలూరు రోడ్డు వెంబడి గేదెలు, దూడలను రోడ్లపైనే కట్టేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు తప్పడంలేదు. రాత్రి వేళల్లో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు వాటి హెడ్ లైట్ వెలుగుతో వాటని తప్పించే సమయంలో చీకట్లో రోడ్లపై కట్టేసిన గేదెలపైకి వాహనాలు వెళ్లిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

తరచూ ప్రమాదాలు

విచ్చలవిడిగా పశు సంచారం వల్ల నిడమర్రు, బువ్వనపల్లి గ్రామాల్లో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గతంలో పోలీసు సిబ్బంది నైట్ గస్తీలో భాగంగా తిరుగుతున్న పోలీసు జీపు పశువులు ఎదురుగా రావడంతో అదుపుతప్పి ప్రమాదం జరిగింది. నాటి గణపరం ఎస్సై హరికృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. పెదనింద్రకొలనులో రాత్రి వేళ పశువులు మందగా ఒకేసారి రాడంతో తప్పించే క్రమంలో ఆటో ప్రమాదానికి గురైంది. మందలపర్రు మలుపులో ఆంబోతును తప్పించబోయి ద్విచక్రవాహనంపై వెళుతున్న దంపతులు అక్కడే ఉన్న పంటబోదెలో దూసుకెళ్లారు. ఇలా గత కొంతకాలంగా ఏదో ఒక ప్రమాదం సంభవిస్తుండడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

యజమానుల తీరు మారాలి

పశువులను రోడ్లపైకి రాకుండా చూడాల్సిన వాటి యజమానులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పశువులు, ఆంబోతులు జన సంచారం ఉన్న బస్‌స్టాపులు, వారాంతపు సంతల వద్ద తిష్ట వేస్తున్నాయి. వీటి వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి, ప్రమాదాలకు గురవుతున్నారు. యజమానులు మానవతా దృక్పథంతో ఆలోచించి ప్రజలను ఇబ్బంది పెట్టకుండా పశువులను ఇళ్ల వద్దే కట్టేసుకోవాడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని బాధితులు సూచిస్తున్నారు. పశువులు రోడ్లపైకి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధ్యతగా ఉండాలి



మండల ప్రధాన రహదారి ఏలూరు రోడ్డుపై, రాత్రి వేళల్లో నిడమర్రు, మందలపర్రు వంతెన వద్ద ఇటీవల ఆంబోతులు, పశువుల సంచారం పెరిగింది. పశువులు రహదారులపై రాకుండా చూసుకోవల్సిన బాధ్యత యజమానులదే. అధికారులు వారికి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలి.

– మంతినీడి వెంకట రమేష్, టీచర్, నిడమర్రు

వారికి నోటీసులిస్తాం



పశువులను రోడ్లపైకి వదలొద్దని గ్రామంలో మైక్ ప్రచారం చేశాం. దీంతో పశువుల యజమానులు కొద్దిరోజులు వదలకుండా ఇళ్ల వద్దే వాటిని కట్టేశారు. 10 రోజుల తర్వాత తిరిగి పశువును రోడ్లపైకి వదిలేస్తున్నారు. రహదారులపై ఆంబోతులను వదులుతున్న వారిని గుర్తించి నోటీసులు ఇస్తాం.

– కిలారీ సత్యవతి రవిబాబు, సర్పంచ్, బువ్వనపల్లి

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



భీమడోలులో గ్రంథాలయాల అవశ్యకతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



ఉంగుటూరులో వారోత్సవాలను ప్రారంభిస్తున్న డీవైఈఓ రవీంద్ర భారతి

భీమడోలు : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవి అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఆమె ప్రారంభించారు. తొలి ప్రధాని నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయ అవశ్యకతపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో ఎంపీడీఓ పద్మావతీదేవి, ఎంఈఓలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్‌లు మాట్లాడారు. సాయంత్రం చిన్నారులకు శతక పద్యాల పోటీలు, వందేమాతరం పూర్తిగేయాలపన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయుడు మండే సుధాకర్, మానవత సంస్థ మండల చైర్మన్ గుల్ల నూకరాజు, సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారథి, ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి బ్రహ్మం, హెచ్‌ఎం బాలిన సత్యనారాయణ, మాంటిస్సోరి విద్యాసంస్థల చైర్మన్ కె.ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ పి.బాలు పాల్గొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పూళ్లలో హెచ్‌ఎం పెనుగొండ భువనేశ్వరరావు, గుండుగొలనులో హెచ్‌ఎం గారపాటి సునీత ప్రారంభించారు. గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

విజ్ఞాన కేంద్రాలు

గణపవరం: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, వీటిని యువత వినియోగించుకుని జ్ఞానం పొందాలని ఎంఈఓ గొర్రెల బాలయ్య అన్నారు. పిప్పర శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిప్పర హైస్కూలు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర, ప్రముఖ చిత్రకారుడు రాజు బత్తుల, న్యాయవాది గుడ్ల వెంకట కృష్ణారావు, గ్రంథపాలకుడు పి.రంగారావు తదితరులు పాల్గొన్నారు. గణపవరం శాఖా గ్రంథాలంయలో గ్రంథాలయ కమిటీ సభ్యుడు గుమ్మడి సుబ్బారావు వారోత్సవాలు ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి సుభాషిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేలు

ఉంగుటూరు : విద్యార్థి దశలో పుస్తక పఠనం ద్వారా మంచి జ్ఞానాన్ని పొందవచ్చని తాడేపల్లిగూడెం డీవైఈఓ రవీంద్రభారతి అన్నారు. ఉంగుటూరు శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఆయుర్వేద డాక్టర్ కస్తూరి శిరీష మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, తల్లాప్రగడ భీమేశ్వరరావు, నారాయణం హనుమంతురావు, కాళ్ల శేఖర్, గ్రంథపాలకుడు చిట్టూరి గంగాధరరావు పాల్గొన్నారు.

వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి

దెందులూరు : వారం రోజుల పాటు నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని పోతునూరు ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వలి అన్నారు. పోతునూరు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి రాంబాబు ఆధ్వర్యంలో వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. దెందులూరులో దెందులూరు గ్రంథాలయ అధికారి ఝాన్సీరాణి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి.

విజ్ఞానానికి దోహదం

పెదపాడు : ప్రజలను విజ్ఞానవంతులను చేసేందుకు గ్రంథాలయాలు తోడ్పాడతాయని ఎంపీడీఓ అమీలు జామా తెలిపారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. మానవత సంస్థ ప్రతినిధి కుకునూరి రామకృష్ణారావు(రాంబాబు), పంచాయతీ కార్యదర్శి వినోద్, కె.రవికుమార్, వేల్పుల ప్రభాకరరావు, గ్రంథపాలకుడు డి.జాన్ బాబు, రామాల బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.


గ్రంథ పఠనం అవసరం

పెదవేగి : విద్యార్థులకు చదువుతోపాటు గ్రంథ పఠనం కూడా ఎంతో అవసరమని పెదవేగి ఎంఈఓ2 వి.అరుణ్‌కుమార్ అన్నారు. గురువారం నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. సాయంత్రం 4 గంటలకు విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. గ్రంథ పాలకుడు అరుణ్ కుమార్, ఉన్నత పాఠశాల పీడీ, విద్యార్థులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాల ర్యాలీకి సర్వం సిద్ధం

దెందులూరు: దెందులూరు గ్రామంలో ఎనిమిది ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రాల ర్యాలీకి సర్వం సిద్ధం చేశామని రామదండు దెందులూరు మండలం నాయకులు సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. 256 మోటర్ సైకిళ్లతో అన్ని శైవ క్షేత్రాలను సందర్శిస్తూ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఆంజనేయస్వామి కరపత్రాలు, జెండాలు మోటర్ బైక్‌లపై పెట్టుకుని ర్యాలీ చేస్తామన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప, గురు స్వాములు, భక్తులు దెందులూరు గ్రామస్తులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

రోడ్లపైనే ధాన్యం రాశులు



దెందులూరు: తుఫాను తమను వీడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కోతకొచ్చి కొన్ని, కోసేసిన వరి ఉంది. వాతావరణ శాఖ తుఫాను సూచన ఇవ్వడంతో రాశులను రోడ్లపైనే పెట్టి తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పారు. ఈ గండం గట్టెక్కాలని నష్టపోకుండా ఉండాలని రైతులు కోరుతున్నారు.

వ్యాయామంతోనే షుగర్‌వ్యాధి అదుపు



సభలో మాట్లాడుతున్న రాజు

గణపవరం : ప్రపంచాన్ని వణికిస్తున్న షుగర్ వ్యాధి అదుపునకు క్రమం తప్పని వ్యాయామం చేయాలని పీఎంపీ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు అన్నారు. గురువారం గణపవరం మండలం కాశిపాడులో సహకార వారోత్సవాల్లో భాగంగా సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కె.రామలక్ష్మి అధ్యక్షతన ప్రపంచ డయాబిటస్ డే, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వైద్యులు 200 మందికి షుగర్, కన్ను, గుండె తదితర వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు పద్మావతిరమేష్‌రాజు, మాజీ ఎంపీటీసీ పెన్మెత్స అజయ్ కుమార్‌రాజు, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, కార్యదర్శి సుభాన్, గణపవరం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సత్యనారాయణమూర్తి, శివశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలో..

దెందులూరు : స్థానిక బీఆర్‌డీ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో ప్రపంచ డయాబెటిస్ నివారణ డే నిర్వహించారు. గురువారం డయాబెటిస్ నివారణను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు నిఖిత, దివ్య మాట్లాడుతూ ప్రాణాలు తీస్తున్న వ్యాధుల జాబితాలో మధుమేహ వ్యాధి 9వ స్థానంలో ఉందని తెలిపారు. ఈ వ్యాధి అరికాళ్లు, కంటి నరాలు, హృదయం, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకుంటాం



గణపవరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గణపవరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకుని, ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు చింతకాయల బాబూరావు అన్నారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బాబూరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, రైతులకు మద్దతు ధర ఇవ్వడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వంపై ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలపేరుతో ప్రజలపై పెనుభారం మోపుతుందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జె.సత్యనారాయణ, మండల నాయకులు ఎం.పెంటారావు, పి.నర్సింహమూర్తి, చిన్నం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ధర్నా

భీమడోలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక చర్యలను నిరసిస్తూ సీపీఎం ప్రజాపోరులో భాగంగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆర్ఐ కిరణకుమారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం జమిలీ ఎన్నికల పేరుతో రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తోందని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించలేని మోదీ ప్రభుత్వంతో ప్రజలకు ప్రయోజనం లేదన్నారు. చంద్రబాబు సర్కార్ సర్దుబాటు పేరుతో ప్రజలపై భారం మోపుతోందని, ఉచిత ఇసుక వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు కట్టా భాస్కరరావు, ముప్పిరిశెట్టి పానకాలు, పి.నాగరాజు, కె.నాగయ్య, బీబీ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి సాధించేలా ప్రణాళికలు



ఉంగుటూరులో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజ్ మనోజ్

ఉంగుటూరు : గ్రామాలు సమగ్రాభివృద్ధి సాధించేలా ప్రణాళికలు ఉండాలని ఎంపీడీఓ రాజ్ మనోజ్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ సమావేశపు హాలులో గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఇతర శాఖల అధికారులకు ఒక రోజు శిక్షన ఇచ్చారు. శిక్షణకు అధ్యక్షత వహించిన ఎంపీడీఓ రాజ్ మనోజ్ మాట్లాడుతూ గ్రామంలో ఉండే అన్ని శాఖల ద్వారా జరిగే పనుల అభివృద్ధికి సంబంధించి పంచాయతీ పాలకవర్గంతోపాటు అన్ని వర్గాల ప్రజలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. జీడీ శ్రీనివాసు శిక్షణ ఇచ్చారు. హౌసింగ్ ఏఈ సురేష్, ఏపీఎం ప్రభావతిలు మాట్లాడారు.

ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

నిడమర్రు : మండంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ విజయకమారి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి ప్రణాళికలు 2025–26 సంత్సరానికి సంబంధించి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వీవోఏలు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటుచేసిన శిక్షణలో ఎంపీడీఓ మాట్లాడారు. ప్రణాళికా బద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రాముఖ్యత, ఆవశ్యకతను వివరించారు.

వార్షిక ప్రణాళిక సిద్ధం చేయాలి

దెందులూరు : మండలంలో వార్షిక ప్రణాళికకు జీపీడీపీలో ఏ విధంగా సిద్ధం చేయాలో అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ కె.శ్రీదేవి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వార్షిక ప్రణాళిక సిద్ధం చేయడానికి ఏర్పాటుచేసిన శిక్షణను ఆమె ప్రారంభించారు. ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలన్నారు. శిక్షణ తరగతుల్లో మండల ఏఓ భీమరాజు, అన్ని శాఖల మండల అధికారులు, గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మండల సమైక్య అధ్యక్షురాలు, సీసీలు ఉన్నారు.

మతిస్థిమితం లేని మహిళకు భరోసా

ఏలూరు టౌన్ : ఏలూరులో మతి స్థిమితం లేని ఒక మహిళకు త్రీటౌన్ పోలీసులు అండగా నిలిచారు. ఏలూరులో ఒంటరిగా సంచరిస్తూ రోడ్డు పక్కనే జీవించే మహిళను పత్తేబాద నగర నిరాశ్రయుల హోంకు తరలించారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో సీఐ ఎస్ కోటేశ్వరరావు తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మతి స్థిమితం లేని మహిళను నిరాశ్రయుల హోంలో చేర్పించారు. ఎవరికైనా ఆమె వివరాలు తెలిసినా, బంధువులు ఎవరైనా ఉన్నా ఏలూరు పత్తేబాదలోని హోమ్‌ను సందర్శించి తెలుసుకోవాలని త్రీటౌన్ సీఐ కోరారు.

విజేతలైన విద్యార్థులకు సన్మానం



పోటీల్లో విజేతలు

గణపవరం : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన జిల్లా, రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో విజేతలైన విద్యార్థులను సన్మానించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సన్మానించి, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మూర్తి, ఎస్‌ఎంసీ చైర్మన్ నిర్మలకుమారి, వైస్ చైర్మన్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చాచా నెహ్రూకి నివాళి

జల్లికొమ్మర యూపీ స్కూల్లో మాజీ ప్రధాని నెహ్రూ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలల మాలలతో విద్యార్థులు ఘన నివాళి అర్పించారు. బాలల దినోత్సవం ప్రాముఖ్యతపై సోషల్ టీచర్ ప్రసాదరావు వివరించారు. చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం సుందరకుమార్, పి.సౌజన్య, సరస్వతి, పార్వతి, రమేష్ తదితరులున్నారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ద్వారకాతిరుమల: మండలంలోని దేవినేనివారిగూడెంలో విద్యుత్ వైర్లకు తగిలి ఒక గడ్డి ట్రాక్టర్ గురువారం దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు దేవినేనివారిగూడెం సొసైటీ రోడ్డును 20 రోజుల క్రితం సీసీ రహదారిగా నిర్మించి ప్రారంభించ లేదు. అయితే గుండుగొలను నుంచి దేవినేనివారిగూడేనికి వచ్చిన ఒక గడ్డి ట్రాక్టర్ రామాలయం వీధిలోంచి వెళుతుండగా పైన విద్యుత్ వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. డ్రైవర్ చాకచక్యంగా సమీపంలో ఉన్న చెరువులోకి ట్రాక్టరును దింపివేశాడు. అప్పటికే గడ్డి పూర్తిగా దగ్ధమైంది.

పదో తరగతి పరీక్షల ఫీజు గడువు పొడిగించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈనెల 18న ముగిసే పదో తరగతి పరీక్ష ఫీజుల గడువును ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పొడిగించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ఒక ప్రకటనలో కోరారు. గతంలో ఆధార్ కార్డులో ఉన్న వివరాలతో సంబంధం లేకుండా పాఠశాల రికార్డుల ఆధారంగా విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని ఇచ్చిన గడువుకు ముందే పూర్తి చేసుకుని ఉండేవాళ్లమని, ప్రస్తుతం అపార్ ఐడీ సమాచారంతో ముడిపడి ఉండడం వల్ల గడువుకు ముందే పూర్తి చేయడానికి అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు.